నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వెంకట్‌నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాయి ఐశ్వర్య కాలనీ, ఖాజాగూడ, నిహారిక రెసిడెన్సీ, సాయి వైభవ్ కాలనీ, అశోక్ బిల్డర్స్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీరాం స్కూల్, చర్చ్ విలేజ్, ఎమరాల్డ్ గార్డెన్, సుమధుర తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చందానగర్‌లో..

చందానగర్ : వేమనకాలనీ, చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- సీబీఆర్ ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు సీబీఆర్ ఎస్టేట్స్, శ్రీ దుర్గ ఎస్టేట్స్, ఆంధ్రాబ్యాంక్ దగ్గర, క్రోమ భవనం వెనుక ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సురక్ష ఎన్‌క్లేవ్, విద్యానగర్, రాజేందర్ రెడ్డి నగర్, సత్య ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

చందానగర్ : తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శివకృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

- పాపిరెడ్డినగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పాపిరెడ్డి కాలనీ, స్ప్రింగ్ వ్యాలీ, భాగ్యలక్ష్మినగర్ కాలనీ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- రాజీవ్ గృహకల్ప ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రాజీవ్ గృహకల్ప ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రక్తదాన శిబిరం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలో శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ జన్మదిన వేడుకల్లో భాగంగా మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మిరియాల రాఘవరావు, రోహిత్ గౌడ్, వివేక్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు | త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలి



హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్

మియాపూర్ : పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులను ఆదేశించారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతి, చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి, కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్ గంగాధర్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముంపు సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి విషయంలో రాజీపడకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

నాలా విస్తరణ పనులు పరిశీలన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో వరద ముంపు శాశ్వత పరిష్కారానికి నాలాల విస్తరణ, బాక్స్‌టైప్ డ్రైన్ పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. నల్లగండ్ల చెరువు నుంచి భెల్ చౌరస్తా వరకు తారానగర్, హుడా ట్రేడ్ సెంటర్ కాలనీల్లో రూ. 28.45 కోట్లతో నిర్మిస్తున్న ఆర్‌సీసీ బాక్స్ టైప్ డ్రైన్ పనులను మంగళవారం కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ డీఈ ధీరజ్, ఏఈ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం, ఎన్‌టీఏ నిర్వహించిన నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ)లో ప్రతిభ చాటిన వారికి ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్(ఐటీఈపీ)లో ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు 'మనూ' అడ్మిషన్ల డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ తెలిపారు. ముఖ్యంగా బీఏ, బీఈడీ, బీఎస్సీ బీఈడీ, బీకామ్ బీఈడీ కోర్సులలో ప్రవేశాలను కల్పిస్తామన్నారు. అభ్యర్థులు జూలై 5వ తేదీ వరకు అడ్మిషన్ పోర్టల్ టీఈపీ ద్వారా నమోదు చేసుకొని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మొదటి తాత్కాలిక జాబితా జూలై 7వ తేదీన విడుదల చేయబడుతుందన్నారు. జూలై 8 నుంచి 10వ తేదీ వరకు పత్రాలను అప్‌లోడ్ చేయవచ్చన్నారు. రెండవ తాత్కాలిక జాబితా జూలై 15న విడుదల చేయబడుతుందన్నారు.అభ్యర్థులు ఉర్దూను సబ్జెక్టుగా/భాషగా లేదా 10వ/22వ లేదా తత్సమాన మదర్సా కోర్సులలో ఉర్దూ బోధన మాధ్యమంగా చదివి ఉండాలన్నారు. వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రోడ్డుపై వర్షపునీరు నిలవకుండా చూడాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి ఈస్ట్ సాయినగర్‌లో రూ.16 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ ఈస్ట్ సాయినగర్‌లోని రోడ్డు నంబర్ 2లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డును లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలవకుండా పనులు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, షౌకత్ అలీమున్నా, పోశెట్టి గౌడ్, సుధాకర్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, విద్యాసాగర్, కొండలరావు, అరవింద్ జగిర్దార్, సాయి, ఏఇ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

పటాన్‌చెరు: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు.మంగళవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్‌గడ్డ దేవస్థానం ఆవరణలో వికసిత్ భారత్‌లో భాగంగా అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అధ్యక్షతన మొక్కల పంపిణీ, అలాగే మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు అమ్మ పేరుతో ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మాణిక్‌రావు, రాజశేఖర్‌రెడ్డి , మహిళా మోర్చా మీనాగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఈజీ సభ్యుడిగా ప్రొ. శ్రీజిత్ మిశ్రా

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం



రాయదుర్గం: దేశవ్యాప్తంగా 2026లో భారతదేశ పూర్తిస్థాయి గృహ ఆదాయ సర్వే రూపకల్పన, అమలుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీఈజీ గ్రూపులో హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ శ్రీజిత్‌మిశ్రాను సభ్యుడిగా నియమించారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ద్వారా టెక్నికల్ ఎక్స్‌పర్ట్ గ్రూప్ (టీఈజీ)ని ఏర్పాటు చేశారు. టీఈజీ చైర్మన్‌గా డాక్టర్ సుర్జిత్ ఎస్ భల్లా, మరో ఏడు మంది సభ్యులను నియమించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేయతలపెట్టిన ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు దీన్ని రూపకల్పన చేశారు.

క్రీడా పరికరాలు పంపిణీ



క్రీడా పరికరాలను అందజేస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు రూ.లక్ష వ్యయంతో కొనుగోలు చేసిన క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ మానసిక వికాసంతో పాటు శారీరక వికాసం అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, ఇంచార్జీ హెచ్‌ఎం బల్వంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మీ, ఉదయ్ కుమారి, దుర్గ భవాని, సూర్యప్రభ, వీరేశం, ధనలక్ష్మీ, పద్మావతి పాల్గొన్నారు.

పుస్తకాలు చదవాలి

మియాపూర్: చందానగర్ డివిజన్‌లోని దీప్తీశ్రీనగర్ కాలనీలో బీజేపీ సీనియర్ నాయకులు రాచమల్ల నాగేశ్వర్‌గౌడ్ నివాసంలో హర్యానా గవర్నర్ రాసిన ప్రజల కథే.. నా ఆత్మకథ పుస్తకంపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ పుస్తక పఠనం అవసరమన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్,రవికుమార్ యాదవ్ ,పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ పుస్తకాలను నాయకులకు అందజేశారు.

మనూలో 'ఏ ప్లస్ ప్రొడక్షన్ హౌజ్' ప్రారంభం

రాయదుర్గం: విద్యార్థులు చదువుకుంటూనే సంపాదించేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ. సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు.గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళవారం 'ఏ ప్లస్ ప్రొడక్షన్ హౌజ్'ను సమనా కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ (ఎస్‌సీడీఎస్)తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రొడక్షన్ హౌజ్' విద్యతో బాటు పరిశ్రమలతో అనుసంధానించడానికి రూపొందించబడిన వేదిక అని అన్నారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ మాట్లాడుతూ ఇది కేవలం ప్రొడక్షన్ హౌజ్ కాదని, డిజైనర్లు తమ కలను సజీవం చేసుకోగల వేదికగా ఆయన అభివర్ణించారు. ఎస్‌సీడీఎస్ చైర్‌పర్సన్ సమనా హుస్సేన్ మాట్లాడుతూ భారతదేశంలో ఇదే మొదటిదని, విశ్వవిద్యాలయ మద్దతుగల ప్రొడక్షన్ హౌజ్ విద్యార్థులకు శిక్షణతో బాటు మార్కెట్‌లో వారు నిలదొక్కుకోవడంలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం, ఎస్‌సీడీఎస్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో హోండా సిటీ స్పోర్ట్



లక్డీకాపూల్ : నగర వీధుల్లోకి హోండా సిటీ స్పోర్ట్ ఎడిషన్ కారు వచ్చింది. మాదాపూర్‌లోని ఫ్రైడ్ హోండా షోరూమ్‌లో బుధవారం ఈ కారును ప్రియా రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఫ్రైడ్ హోండా జనరల్ మేనేజర్ కిరిట్ కుమార్, ఏజీఎం రాఘవేంద్ర పాల్గొన్నారు.

తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా అజయ్‌కుమార్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.అజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న సంగారెడ్డి సీడీఎంఏకు బదిలీపై వెళ్లారు. యాదగిరిగుట్ట కమిషనర్‌గా పని చేస్తున్న ఎస్.అజయ్‌కుమార్‌రెడ్డి బదిలీపై తెల్లాపూర్ కమిషనర్‌గా వచ్చారు.

జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రైవ్‌లో 14 మంది పట్టుబడగా మంగళవారం వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపరిచారు. 10 మందికి ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున జరిమానా, ముగ్గురికి రూ .వెయ్యి, ఒక్కరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.